ప్రజాశక్తి
బుధవారం 22 జనవరి 2025
5
అనంతపురం

లెనిన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

# లెనిన్ బాటలో నడుద్దాం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

అసమానతలు లేని పీడిత ప్రజానీకానికి హక్కులు కల్పించాలంటే సోషలిజం ఒక్కటే పరిష్కారమని లెనిన్ చూపిన బాటలో నడుద్దామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం నగర కమిటి ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గణేనాయక్ భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లెనిన్ చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ అతి తక్కువ జీవిత కాలంలో ప్రపంచ పీడితుల విముక్తి మార్గానికి నిత్య సూర్యోదయంగా, కష్టజీవుల ఉద్యమాలకు అన్ని తానై నడిపించిన విప్లవకారుడు లెనిన్ అన్నారు. విప్లవోద్యమానికి ఎదురైన ప్రతి క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప అన్వేషి అని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఒకవైపు పోరాడుతూనే, మరోవైపు విప్లవ పార్టీ నిర్మాణం కోసం అంతర్గత విరోధులతో ఏక కాలంలో పోరాడి విజయం సాధించిన నిజమైన సవ్యసాచి లెనిన్ అన్నారు. కార్మికుల చైతన్యాన్ని తక్కువ చేసి మాట్లాడేవారికి, ఆర్థిక పోరాటాలే కీలకమని భావించేవారికి, పరిస్థితుల సాకుతో పనులు వాయిదా వేసేవారికి, చిన్న విజయాలను చూసి గర్విష్టులుగా మారే వారికి, మార్క్సిజానికి వక్రభాష్యాలు చెబుతూ కార్యకర్తల్లో గందరగోళాలు సృష్టించే స్వపక్ష ద్రోహులకు, పార్టీ నిర్మాణ సూత్రాలను ధిక్కరిస్తూ పార్టీ కంటే అతీతులమని భావించే అహంకారులకు లెనిన్ తన రచనల ద్వారా చెంప చెళ్లుమనిపించాడన్నారు. వంద సంవత్సరాల కిందట చనిపోయిన లెనిన్ ఇప్పటికీ ఆయన చూపిన బాట యావత్ ప్రపంచానికి శిరోధార్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కమిటీ సభ్యులు వై.వెంకట నారాయణ, ముత్తూజా, నగర నాయకులు ప్రకాష్‌రెడ్డి, వలి, ఇర్ఫాన్, ఎన్‌టిఆర్ శీన, ఇల్లూరు నల్లప్ప, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

# 'అనంత' నగరపాలికలో అవినీతి కంపు

అనంతపురం పురపాలక పరిపాలన శాఖ కార్యాలయం

**ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్**

అనుకున్నదంతా అయింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అవినీతి కంపు డిఎంఎ హరి నారాయణ ముక్కుపుటాలను అదరగొట్టింది. ఆదివారం జరిగిన మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ పర్యటన మొత్తం రహస్యంగానే సాగింది. నగరంలో డంపింగ్ యార్డ్ పరిశీలన, నూతన భవనాలకు పన్ను, విధింపు అక్రమ కట్టడాల అవినీతి బాగోతం పరిశీలన తదితర పర్యటన యావత్తు రహస్యంగానే జరిగింది. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు ఆయన పర్యటనలో వెలుగుచూసిన అవినీతి అక్రమాల వివరాలు... సాక్షాత్తు మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న పుష్ప నిలయం ఆస్తిపన్ను, భవన నిర్మాణ అనుమతి తదితర అంశాలను స్వయంగా డిఎంఎ హరి నారాయణ ఒక్కరే వెళ్లి పరిశీలించారు. పుష్ప నిలయంలోని జి ప్లస్ టు భవంతికి పాత ఇంటి పన్నునే కొనసాగించడం ఆయన దృష్టికి వచ్చింది. నూతన భవంతికి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారులు కొత్త భవంతి పన్ను వేశారా లేదా అని ఆయన ఆరా తీశారు. పాత ఇంటిని రిమోడల్ చేశామని గృహ యజమాని శకుంతల బాయి తెలిపారు. కట్టడం కొత్తదైతే పాత ఇంటి పన్ను ఎలా కొనసాగిస్తున్నారంటూ డిఎంఎ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పుష్ప నిలయంలో పుష్పాంజలి ఫ్యాషన్స్ పేరుతో బోర్డు ఉంది. ఇంటిలో చీరాల వ్యాపారం జరుగుతోంది. అలాంటిది కమర్షియల్ టాక్స్ ఎందుకు వేయలేదని ఆయన ప్రశ్నించారు. పక్కనే ఉన్న భవంతి తమదేనని తన భర్త ఉమామహేశ్వరరావు పేరుపై ఉందని అందులో షాపు అద్దెకు ఇవ్వగా వాణిజ్య పన్ను వేశారని శకుంతల డిఎంఎకు తెలిపారు. అలాగే పుష్ప నిలయం పక్కన శకుంతల బాయికి సంబంధించిన నూతన మూడంతస్తుల భవనం, ఎస్ ఉమామహేశ్వరరావు పేరుతో ఆస్తిపన్ను ఉన్న డిమాండ్ రసీదును డిఎంఎ పరిశీలించారు. గృహయజమాని శకుంతలా బాయ్ చెప్పినట్లుగా రీ మోడల్ చేసిన భవంతిగా కాకుండా నూతన నిర్మాణం చేసుకున్న భవంతిగా డిఎంఎ పరిశీలనలో వెల్లడి కావటంతో మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం ఆ అవినీతికి ఇవి సాక్ష్యాధారాలుగా నిలుస్తున్నాయి. భవన యజమానురాలు చెప్పినట్లుగా కాకుండా చూస్తే నూతన భవన నిర్మాణానికి బిల్డింగ్ ప్లాన్ తీసుకున్నారా తీసుకుంటే అనుమతి మేరకు నిర్మాణాలు జరిపారా లేక అనుమతి లేకుండానే భవన నిర్మాణం జరిగిందా అన్న అంశాలపై వాస్తవాలు వెలుగు చూడాల్సి ఉంది. అలాగే రెండు నూతన భవనాలకు పాత ఇంటి పన్ను రసీదు విధించారని గృహ యజమానురాలు శకుంతల బాయి పేర్కొనడాన్ని చూస్తే భవన నిర్మాణం జరిగినప్పటి నుంచి నూతన భవనాలకు సంబంధించి ఎంత మేరకు మున్సిపల్ కార్పొరేషన్ ఖజానకు ఆస్తి పన్ను పేరిట గండి పడింది అన్న లెక్క తేలాల్సుంది. ఈ రెండు అంశాల్లోనూ అటు రెవెన్యూ విభాగం ఇటు టౌన్ ప్లానింగ్ విభాగం ఈ అవినీతికి భాగోతానికి జవాబుదారీగా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నది నగ్నసత్యం. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి కంపోస్టు యార్డులో బయో మైనింగ్ పేరిట పనులు పూర్తికాకుండానే కోట్ల రూపాయలు స్వాహా జరిగిందన్న అవినీతి అరోపణలపై మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ గుత్తి రోడ్డుకు వెళ్లి కంపోస్ట్ యార్డ్‌ను పరిశీలించారు కంపోస్ట్ యార్డులో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాలను పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పర్యవేక్షణలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలోని కంపోస్ట్ యార్డ్‌ను బయోమైనింగ్ ద్వారా చెత్త చెదారాలను నిర్మూలించాలని నిశ్చయించారు. ఈ మేరకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో 26 కోట్ల రూపాయల వ్యయం కాగల టెండరు నిర్వహించగా లెస్ రేట్లతో రూ. 23 కోట్లకు హైదరాబాద్‌కు చెందిన ఇంజనీరింగ్ ఎనర్జీ కంపెనీ సొంతం చేసుకుంది. ఇప్పటిదాకా 11 కోట్ల రూపాయల మేరకు పనులు నిర్వహించి 9 కోట్ల రూపాయలను కంపెనీ తీసుకుంది మిగతా రెండు కోట్ల రూపాయలకు బిల్లులు పెట్టింది. ఈ బిల్లులను అకౌంట్ ఆఫీసర్ పద్మావతి ద్వారా ఎగ్జామినర్ కు ఆమోదానికై పంపింది. అయితే టెండర్ నిబంధనలో రోజుకు వెయ్యి టన్నుల చెత్త చెదారాన్ని బయో మైనింగ్ ద్వారా చేస్తామని కంపెనీ పేర్కొనగా ఏం బుక్ లో ఇంజనీరింగ్ అధికారులు రోజుకు 2వేల టన్నుల చెత్త చెదారాలను బయో మైనింగ్ చేసినట్లుగా రికార్డు చేయటం ఎగ్జామినర్ గోవిందు పరిశీలనలో వెల్లడైంది. దీంతో ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలను, రికార్డులను జత చేసి పంపాలని అకౌంటెంట్ కు తిప్పి పంపారు. అయితే ఈ అవినీతి వ్యవహారం తన మెడకు చుట్టుకుంటుందేమోనన్న భయంతో అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతి వారం రోజుల కాల వ్యవధిలోనే పంచాయతీ రాజ్ శాఖ కు బదిలీ చేయించుకుని వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అప్పటినుండి రెండు కోట్ల రూపాయల బిల్లు పెండింగ్‌లో ఉండిపోయింది. అయితే ఈ బిల్లు పెట్టడానికి నాలుగు రోజుల ముందే జరిగిన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో కంపోస్ట్ యార్డ్ అవినీతిపై పాలకవర్గంలోనే పెద్ద ఎత్తున ఆరోపణల పర్వం నడిచింది. ఈ అవినీతిలో నిజం నిగ్గు తేల్చాలని అర్బన్ ఎమ్మెల్యే సైతం కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ ఫైలుపై అప్పటి కమిషనర్ మేఘ స్వరూప సంతకం పెట్టి ప్రాసెస్ చేయడం విశేషం. బిల్లును పెండింగ్‌లో ఉంచాలని కౌన్సిల్ సమావేశం పట్టుబట్టినా అటు కమిషనర్ గాని ఇటు అకౌంటెంట్ ఆఫీసర్ కానీ కౌన్సిల్ తీర్మానాన్ని పట్టించుకోకుండా స్వతంత్రించి వ్యవహరించటం పెద్ద దుమారాన్ని రేపింది. ఈ క్రమంలో ఆదివారం మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ ఒక్కరే వెళ్లి కంపోస్ట్ యార్డ్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త పర్వతాలను పరిశీలించి వచ్చారు. ఈ రెండింటి పరిశీలన తర్వాత అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వెంట రాగా కలెక్టరేట్‌కు వెళ్లిపోయారు అయితే డిఎంఎ పర్యటనలో ఏ దశలోనూ ఎక్కడ ఆయన పర్యటన బహిర్గతం కాకుండా పత్రికలకు సైతం సమాచారం ఇవ్వకుండా గుట్టుగా సాగించటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ విభాగాల అవినీతి వ్యవహారాలపై వరుసగా ఫిర్యాదులు అందుతుండటంతో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరి నారాయణ పర్యటన ఆసక్తి కలిగిస్తోంది. ఆయన పర్యటన వివరాలను కనీసం పత్రికలకు బ్రీఫ్ ఇవ్వటం కూడా జరగలేదు. ఆయన పర్యటనలో తేలిన అక్రమాలపై ఎలాంటి చర్యలు ఉంటాయన్న అంశం ఆసక్తికరంగా మారింది.

**డిఎంఎ పర్యటనలో బహిర్గతమైన అక్రమాలు**
**రహస్యంగా సాగిన డిఎంఎ పరిశీలన**
**అధికారులపై ఆగ్రహం**

# రైల్వే సమస్యలు పరిష్కరించాలి

## ఎస్‌సిఆర్ రైల్వే జిఎంను కలిసిన ఎంపి అంబికా

**ప్రజాశక్తి-అనంతపురం రూరల్**

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని రాయదుర్గం, అనంతపురం, హిందూపురం పట్టణాలకు సంబంధించిన అనేక రైల్వే సమస్యలు పరిష్కరించాలని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈమేరకు మంగళవారం సౌత్ వెస్ట్రన్ రైల్వే జనరల్ మేనేజర్ అరవిందవాత్సవను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు రైళ్లను రాయదుర్గం రైల్వేస్టేషన్‌లో ఆపాలని, అనంతపురం-హిందూపురం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రాయలచెరువు వద్ద నిలపాలని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురంలో నిలపాలని, రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను హిందూపురం, అనంతపురం, పెనుగొండలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితోపాటు కోచ్ నంబర్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం చేపట్టాలని, మరుగుదొడ్ల సదుపాయాలు, క్యాంటీన్లు, లైటింగ్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే అనంతపురం, హిందూపురం స్టేషన్లలో హైడ్రాంట్ వాటర్ కోచస్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

సౌత్ వెస్టన్ రైల్వే జనరల్ మేనేజర్ అరవింద వాత్సవకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపి అంబికా

ప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు, జర్నలిస్టులు

# జర్నలిస్టు ప్రసాద్ సేవలు ఆదర్శం

## సంతాప సభలో ప్రముఖులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

సీనియర్ పాత్రికేయులు నందినేని దేవప్రసాద్ మీడియా రంగానికి, సమాజానికి అందించిన సేవలు ఆదర్శనీయమని ప్రముఖులు కొనియాడారు. పాత్రికేయుల ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్, ప్రెస్‌క్లబ్ పెద్దాయన నందినేని తేజా, జెమిని దేవప్రసాద్ సంస్మరణ సభను మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఏపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు, సీనియర్ పాత్రికేయులు తలారి రామాంజినేయులు అధ్యక్షతన నిర్వహించిన సంస్మరణ సభకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యాల రావు, సీనియర్ జర్నలిస్ట్ ఆజాద్, మచ్చారామలింగారెడ్డి, రవిచంద్ర, నాయుడు తదితరులు పాల్గొన్నారు. తొలుత దేవ ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ మీడియా రంగంలో జెమిని ప్రసాద్ సేవలు మరువలేవని తెలిపారు. జీవితం మొత్తం నిస్వార్థంగా మీడియా రంగానికే పరిమితమయ్యారని అన్నారు. తన జీవితంలో ఎన్నో విలువైన ఆస్తులు కూడా కోల్పోయి, విలువలతో కూడిన జీవనాన్ని సాగించారని కొనియాడారు. జిల్లాలో అప్పటి సాగు కరువు పరిస్థితులను ఆ రోజుల్లో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ప్రచురించి ప్రభుత్వాలను కదిలించారని చెప్పారు. జిల్లాలో ఇప్పటికి సాగు వ్యవసాయ రంగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని జర్నలిస్టులు వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. జీవిత కాలం సేవలు అందించి మరణానంతరం కూడా వైద్య విద్యా విద్యార్థులకు ఉపయోగపడేలా పార్థివదేహాన్ని అందించడం ఆదర్శనీయం అన్నారు. ఇతర పాత్రికేయులు, స్నేహితులు ప్రసాద్‌తో ఉన్న అనుబంధాన్ని స్మరించుకుంటూ నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డిస్కవరి అనిల్, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు ప్రకాష్, పాత్రికేయులు కాలవ రమణ, కెపి.కుమార్, రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దాసన్న, డేవిడ్, సుధాకర్, భుజంగరావు పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చొరవతోనే విశాఖ ఉక్కుకు నిధులు

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు బ్రేక్ -టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

విశాఖ ఉక్కు పరిశ్రమను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రయివేటీకరణకు మొగ్గు చూపితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఆంధ్రుల హక్కును నిలబెట్టారని టిడిపి జిల్లా అధ్యక్షులు టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వేంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీతో కలిసి మాట్లాడుతూ వేలాది మంది తెలుగువారి విరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయడానికి కేంద్రంలోని ఎన్‌డిఎలోని ప్రభుత్వం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. గతంలో మాజీ సిఎం జగన్ కేవలం తనపై ఉన్న కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండి ఢిల్లీకి వెళ్లేవాడని విమర్శించారు. అయితే నేడు అందుకు భిన్నంగా సిఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం హస్తీనకు వెళ్లి వస్తున్నారన్నారు. అంతేగాకుండా చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రతీసారి రాష్ట్రానికి శుభవార్త తెస్తూనే ఉన్నారన్నారు. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడేందుకు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినేట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు. దీంతో స్టీల్ ప్లాంట్ కి మళ్లీ పూర్వ వైభవం వచ్చిందన్నారు. గతంలో రాష్ట్ర మంత్రులపాటు అప్పటి సిఎం దావోస్ పర్యటనకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం చంద్రబాబు ఇంత చలిలో కూడా స్వెట్టర్ వేసుకోకుండా రాష్ట్రానికి పరిశ్రమలు తేవాలన్న సంకల్పంతో పని చేస్తున్నారన్నారు. అలాగే చంద్రబాబు సిఎంగా అయినప్పటి నుంచి రాష్ట్రానికి పరిశ్రమలు, ఐటీ సంస్థలు క్యూ కడుతున్నాయన్నారు. ఇది చూసి ఓర్వలేక కొంతమంది వైసిపి నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఎపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ఆదెన్న, జిల్లా ప్రచార కార్యదర్శి కూచి హరి, తదితరులు పాల్గొన్నారు.

# గిట్టుబాటు ధరతో కందుల కొనుగోలు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో రైతులు పండించిన కంది పంటకు ఏపి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి క్వింటాకు రూ.7550 గిట్టుబాటు ధర చెల్లించనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మంగళవారం ప్రకటన ద్వారా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే కంది కొనుగోలు ఏర్పాటు చేసి రైతుల నుంచి నాణ్యమైన కందిని కొనుగోలు చేయనున్నామని, రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ నందు నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కంది కొనుగోలు చేస్తామని, తేమ శాతం 12 శాతం లోపుల చూసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు ఇతర వివరాలకు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ 8978381841, కంట్రోల్ రూమ్ 8500292992 నెంబర్‌లకు సంప్రదించాలన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎఫ్‌ఐసిటిసికి ఆమోదం

అనుమతిపత్రం అందుకుంటున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్

**ప్రజాశక్తి-అనంతపురం**

స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఫెసిలిటీ ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు అనుమతి పత్రాన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎల్ సుబ్రమణ్యంకు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇకనుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని మైక్రోబయాలజీ విభాగంలో హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ పరీక్షలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. వీటికి తోడు హెచ్ఐవి వ్యాధి నిర్ధారణ కిట్లను అందించేందుకు ముందుకు రావడం ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసిన అహుడా ఛైర్మన్

**ప్రజాశక్తి-అనంతపురం**

హిందూపురం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణను మంగళవారం హిందూపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించారు. హిందూపురం అభివృద్ధికి అహుడా సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఆకుల ఉమేష్, జనసేన నాయకులు అంకే ఈశ్వరయ్య, కుమ్మర నాగేంద్ర, సంజీవ రాయుడు, రాపా ధనంజయ, రమణ చంద్రశేఖర్, చక్రవర్తి, చిన్న ప్రవీణ్, లోకేష్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలకృష్ణకు బొకే అందజేస్తున్న వరుణ్

# తాగునీటి సమస్య పరిష్కారం

**యాడికి :** మండల పరిధిలోని దైవాలమడుగు గ్రామంలో రెండు రోజుల నుంచి నెలకొన్న తాగునీటి సమస్యను లక్షుంపల్లి సర్పంచి పద్మనాభరెడ్డి మంగళవారం పరిష్కరించారు. గ్రామంలో తాగునీరు బోరుబావుల్లో నీరు అడుగుంటింది. సమాచారం అందుకున్న సర్పంచు గ్రామ సమీపంలో కొండ వద్ద ఉన్న బోరు బావిలోనికి అదనంగా రెండు పైపులు దించడంతో నీరు పుష్కలంగా వచ్చింది. దీంతో గ్రామానికి తాగునీటి సమస్య తొలగిపోయింది.

# గిరిజనులకు అండగా జాతీయ కమిషన్

## జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ మెంబర్ జాతూ హుస్సేన్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

గిరిజనులకు అండగా షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ పనిచేస్తుందని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ మెంబర్ జాతూ హుస్సేన్ పేర్కొన్నారు. మంగళవారం సత్యసాయి జిల్లాలో ఒక్కరోజు పర్యటనలో భాగంగా, కదిరి, ముదిగుబ్బ మండలాల్లోని పలు తండాలను సందర్శించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ తెగల సమగ్ర అభివృద్ధికి విద్యా కార్యక్రమాలు, జీవనోపాధి కోసం ఆర్థిక పద్ధతులు, పథకాలు, అట్రాసిటీ నివారణ చట్టం, అటవీ హక్కుల చట్టం, తండల్లో మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ మాట్లాడుతూ జిల్లాలో పలు తండాలలో ప్రజలు అనేక సమస్యలతో సమమతమవుతున్నారనివారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో అధికారుల కృషి ఎంతో అవసరమని తెలిపారు. రాజ్యాంగం 89వ చట్టం సవరణ ద్వారా 2003లో షెడ్యూల్డ్ తెగల కొరకు జాతీయ కమిషన్ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి వి. రత్న, డిఆర్ఒ విజయ సారథి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీవోలు సువర్ణ, మహేష్ శర్మ, ఆనంద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రావ్, జిల్లాలోని వివిధ శాఖల హెచ్వోడీలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూములను కాపాడండి :** పుట్టపర్తిలో ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నాయని ఈ భూములను కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, కోశాధికారి సాకే వెంకటేష్ కోరారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాతు హుస్సేన్ కు వారు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పెత్తందారులు భూస్వాములు తమ రాజకీయ సామాజిక ఆర్థిక పలుకుబడి ఉపయోగించి విలువైన ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారు చేసి కబ్జాలకు పాల్పడుతున్నట్లు గత వారం రోజుల నుండి పత్రికల్లో కథనాలు వస్తున్నాయనీ. ఈ కథనాల వాస్తవాల పరిశీలన కూడా సంబంధిత అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవి, ప్రభావతి, దేవి, నవ్యలేఖ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించాలి

## విద్యుత్ కమిషన్‌కు ఎపి యునైటెడ్ సిటిజన్ ఫోరం నేతల వినతి

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

విద్యుత్ వినియోగదారులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అదనపు ఛార్జీల వసూళ్లపై చేస్తున్న అభ్యంతరాలు, ఫిర్యాదులను ఆంధ్రప్రదేశ్ పవర్ రెగ్యులేటరీ కమిషన్ స్వీకరించాలని ఎపి యునైటెడ్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఎజి.రాజమోహన్ కోరారు. ఈమేరకు మంగళవారం కమిషన్‌కు మెయిల్ ద్వారా తన అభ్యర్థనలు పంపించారు. విద్యుత్ నిబంధనలకు ప్రతిపాదన సవరణ ముసాయిదా వెబ్‌సైట్‌లో అనేక లోపాలను అప్‌లోడ్ చేశారని తెలిపారు. విద్యుత్ వినియోగదారుడు చాయిస్‌గా నిబంధనలు ఉండాలన్నారు. ముసాయిదా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాల్లో అన్ని వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న కార్యక్రమాల్లో సంబంధిత భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా ముందస్తు చెల్లింపులు ఉండాలన్నారు. స్మార్ట్ మీటర్లను వినియోగదారులు తిరస్కరిస్తే ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. పైగా అందకు అయ్యే ఖర్చు రూ.13300 ఫీజు కూడా వినియోగదారులపై వేయడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లు ప్రీపెయిడ్ మీటర్లను ప్రభుత్వమే ఉచితంగా అమర్చాలన్నారు. 200 యూనిట్లు వినియోగించే వినియోగదారునికి ప్రీ ప్రయిడ్ మీటర్ల పెట్టడం అసంబంధం అన్నారు. ఏపిఇఆర్‌సి స్మార్ట్ మీటర్‌ల బిల్లులను భౌతికంగా వినియోగదారునికి ఇవ్వాలన్నారు. అందువల్ల వారికి సమస్యలు తెలుస్తాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిసిఎ ఛార్జీలు, డిస్కౌంట్ తెలియజేసి ఎందుకు విధిస్తున్నారో వినియోగదారునికి వివరించాలన్నారు. ప్రీపెయిడ్, స్మార్ట్ మీటర్‌ల కోసం డిస్ కనెక్ట్ చేయడానికి ముందుగా వినియోగదారునికి తెలియజేసి సమానమైన క్రెడిట్ అందించే విధంగా ఉండాలన్నారు. ఆ తరువాత మాత్రమే డిస్‌కనెక్ట్ చేయాలన్నారు.

# జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుందాం

**ప్రజాశక్తి-ఉరవకొండ**

జ్వరాలు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుందామని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది చిన్నముష్టూరు గ్రామంలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరం ఎక్కువగా వచ్చిన వారిని వెంటనే రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికిగానీ,ఉరవకొండ సామాజిక ఆరోగ్య కేంద్రానికిగానీ తీసుకువెళ్లాలన్నారు. జ్వరం వచ్చిన వారు నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరించరాదన్నారు. ఇంట్లో జ్వరం వచ్చిన వారందరికీ రక్తపు నమూనాలు సేకరించి ల్యాబ్ కు తక్షణమే పంపాలన్నారు. అనంతరం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ల్యాబ్ రికార్డులను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్‌కి సలహాలు, సూచనలు అందజేశారు.

మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి

## కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

### రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలో కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 1.3లక్షల హెక్టార్లలో కందిపంటను సాగు చేశారన్నారు. 80 వేల మెట్రిక్ టన్నులకు పైగా పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోందన్నారు. వేరుశనగ గిట్టుబాటు కాకపోవడంతో ఎక్కువ మంది రైతులు కంది పంటను సాగు చేశారని తెలిపారు. వచ్చిన కంది పంట దిగుబడిని సకాలంలో అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళారుల చేతిలో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వెంటనే కందులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా అధికారులు వెంటనే కంది పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు రూ.7550కు అదనంగా బోనస్ రూ.2వేలు ప్రకటించాలన్నారు.

## ముగిసిన కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు

**ప్రజాశక్తి-అనంతపురం క్రైం**

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ పి.జగదీష్

జిల్లాలో గతనెల 30వతేదీ నుంచి కొనసాగుతున్న కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగిశాయి. వివిధ కారణాలతో గైర్హాజరైన అభ్యర్థులు ఎత్తు, ఛాతీ కొలతలు, తదితర అంశాల్లో అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు ముగింపు రోజు ఎస్పీ పి.జగదీష్ అవకాశమిచ్చారు. ఇందులో భాగంగా స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో వేకువజామునే హాజరయిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం ఎత్తు, ఛాతి కొలతలు ఆతర్వాత 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు మరియు లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ప్రారంభం నుంచి ముగింపు వరకూ ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా యావత్తు ఈ ప్రక్రియను దగ్గరుండి జిల్లా ఎస్పీ పర్యవేక్షించి విజయవంతం చేశారు. సిసి కెమెరాల పర్యవేక్షణలో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి.

## యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**రాయదుర్గం :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యుటిఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌తోపాటు టెన్స్ మోడల్ పేపర్‌ను మంగళవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రామాంజనమ్మ మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిష్ణాతులు, అనుభవజ్ఞులైన సీనియర్ ఉపాధ్యాయులతో తయారు చేసిన ఎస్ఎస్‌సి మోడల్ పేపర్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మోడల్ పేపర్‌ను చదివి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు హనుమంతప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నాయకులు, వెంకోబ్ రావు, జయసింహా, హనుమంతప్ప, శశిధర్, ఉరుకుందప్ప, ఉపాధ్యాయులు, జయశ్రీ, గాయత్రి, భార్గవి, విజయమ్మ, ప్రసన్నలక్ష్మి, సునీత, విజయభారతి, నాగరాజు, లోకాభిరామం, పద్మనాభరావు, సుబ్బారావు, రమేష్, నాగలింగయ్య, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాతిదూలం లాగుడు పోటీలకు విరాళం

నాగులగుడ్డం వెంకటరమణ సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు

**పామిడి :** మండల కేంద్రంలో నిర్వహించనున్న అంకాలమ్మ, కుంటెమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా నిర్వమించనున్న రాతిదూలం లాగుడు పోటీలకు వైసిపి నాయకులు నాగులగుడ్డం దాసరి వెంకటరమణ మంగళవారం రూ.15వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాతిదూలం లాగు పోటీల్లో తనవంతు సాయంగా విరాళం అందజేసినట్లు తెలిపారు. అమ్మవారి దయతో మూడేళ్లుగా విరాళం ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం గుడి కమిటీ సభ్యులు, గ్రామస్తులు వెంకటరమణను ఘనంగా సత్కరించారు.

## అనంత వాసులకు 'తెలుగు కీర్తి' అవార్డులు

పురస్కారం అందుకుంటున్న పతికి రమేష్

**అనంతపురం సిటీ :** పలువురు అనంతవాసులను 'తెలుగుకీర్తి' పురస్కారం వరించింది. ఈమేరకు విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్ కళావేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అనంతపురానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, ఎస్ఆర్. ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు, అర్బన్ సహకార బ్యాంక్ డైరెక్టర్ సుంకరరమేష్, యూనివర్సిటీల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బత్తల అశోక్‌కుమార్‌కు పురస్కారాలను ప్రదానం చేశారు.

**నోటిఫికేషన్ ప్రకటన**

**కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము శ్రీ కొండమీద వెంకటరమణస్వామి దేవస్థానం, బుక్కరాయసముద్రం గ్రామము & మండలం అనంతపురం జిల్లా**

పై దేవస్థానము నందు 2025 సంవత్సరము ఫిబ్రవరి నెల 06 తేది నుండి 14వ తేది వరకు జరుగు బ్రహ్మోత్సవముల సందర్భముగా ఈ క్రింద తెలిపిన పనులకు గాను కొటేషన్లను ఆహ్వానించడమైనది.

(1).దేవస్థానము సత్రము, కాంపౌండ్ వాల్, రూములు మొదలగు వాటికి సున్నముపూతలు వేయుటకు సున్నము తదితర వాటిని సప్లయ్ చేయుటకు, (2).సున్నము పూతలు వేయుటకు కూలీలు, (3).పేయింటింగ్స్ విమాన గోపురములు, సాలాహారము తదతర వాటికి పెయింటింగ్స్ సప్లయ్ చేయుటకుగాను, (4).పెయింటింగ్స్ వేయుటకు కూలీలు, (5).దేవాలయ ఆలయ ఆవరణములో ఉన్న వసతి గదులకు డిస్టంబరు మరియు ఎమల్షన్ పెయింట్స్ వేయుటకు మరియు లేబరు కూలీలు, (6) దేవాలయ పరిసర ప్రాంతాలు మరియు రథోత్సవము తిరుగు రస్తా కొండపైకి వెళ్ళు మెట్లమార్గము, రోడ్డుకు ఇరువైపుల వున్న ముళ్లచెట్లను తొలగించుట, జెసిబితో క్లీనింగ్ చేయుట, (7).దేవాలయం వద్ద చలువ పందిర్లు, క్యూలైన్ ఏర్పాటు చేయుట, (8).విద్యుత్ అలంకరణ (కొండపైన మరియు గ్రామము నందు ఉన్న దేవాలయములకు విద్యుత్ అలంకరణ) తదితర పనులకు ఆసక్తి గల వారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 28.01.2025 తేది లోపల పంపవలసినదిగా కోరడమైనది.

తేది: 21-01-2025

సాకే రమేష్‌బాబు,
కార్యనిర్వహణాధికారి,
శ్రీ కొండమీద వెంకటరమణస్వామి దేవస్థానము,
బుక్కరాయసముద్రము.

**IN THE COURT OF THE HON'BLE DSTRICT JUDGE, ANANTHAPURAMU.**
(In Tha Matter Obtaiming Permission To Lease Property of Minor G.Ganesh)
G.W.O.P. No 02/2025

**Between:**
G.Lakshmi Devi W/o G. Nagaraju, D.No:2/111, B.C.Colony, Bethapalli, Gooty (M) **...Petitioner**
**And**
Nil **...Respondants**

**ప్రకనట**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయు ఏమనగా పై కేసులో మైనరు అయిన గొడ్డుమర్రి గణేష్‌కు చెందిన షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని (Lease) కౌలుకు మరియు వాటి ద్వారా వచ్చు మొత్తము రూపాయిలు తీసుకొనుటకు పర్మిషన్ ఇప్పించుటకు పై కోర్టులో పిటిషనర్ పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరి కేసు 10/02/2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు.ఆ రోజు ఎవరికైన ఆక్షేపణలు వున్నచో స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు అర్జీదారురాలు పరంగా తీర్మానింతురని ఇందుమూలముగా తెలపడమైనది.

**షెడ్యూలు**

అనంతపురం రి॥డి॥ గుత్తి సబ్॥రి॥డి లో చేరిన బేతాపల్లి గ్రామ పొలమునకు చెందిన భూమి

| బాబు | సర్వే నెం. | విస్తీర్ణం | విస్తీర్ణం |
|---|---|---|---|
| Govt-Dry | 211-A | A.C.7-15C పైకి, | A.3-571/2 Cents |

**Bounded By**:
**East**: Land of Gift deed of Goutham on The Same Day
**West**: Land of Raghu Ramudu
**North**: Rasta
**South**: Land of Gangaiah

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
**S.JAKIR HUSSAIN,**
Advocate, Gooty

## పంటకోత ప్రయోగాలు

పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

**పుట్లూరు :** మండల పరిధిలో కోమటికుంట్ల గ్రామంలో మంగళవారం ఇద్దరి రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటలో అధికారి ఎఇఒ హరి ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు ఎఒ కాత్యాయని తెలిపారు. అలాగే గరుగు చింతలపల్లి గ్రామంలో రైతు సరోజమ్మ సాగు చేసిన కందిపంటలో పంటకోత ప్రయోగం చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ మనోరమ, బీమా ఏజెంట్ షమీర్, విఆర్ఎలు ప్రసాద్, అంకన్న, రైతులు పాల్గొన్నారు.

## టిడిపితోనే బిసిల అభివృద్ధి

### నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆదినారాయణ

**ప్రజాశక్తి-శింగనమల**

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో బిసిల అభివృద్ధి సాధ్యమని నాయీబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలానికి చెందిన నాయీబ్రాహ్మణులు ఆదినారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం బీసీలకు అందించే సబ్సిడీ రుణాలను రద్దు చేసి అభివృద్ధికి దూరం చేసిందన్నారు. అయితే టిడిపి అధికారంలోకి వచ్చాక తిరిగి బిసి కార్పొరేషన్ రుణాలను తీసుకొచ్చిందన్నారు. కావున బిసిలు రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షులు కాయల సురేష్‌యాదవ్, ఐటిడిపి చాంపియన్ ముని, సోమందేపల్లి మండల నాయీబ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు మనోహర్, ఉపాధ్యక్షులు ఆర్.నరసింహమూర్తి, కోశాధికారి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, సంజీవరాయుడు, రామకృష్ణ, మహేష్, పాపన్న మూర్తి, బాలకృష్ణ, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

### ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**ప్రజాశక్తి-నార్పల**

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రభుత్వం ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మూడు నెలల్లో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంతోపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలన్నారు. అలాగే రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలకు తక్షణం పరిష్కారం చూపాలన్నారు. అనంతరం పలు సమస్యలపై సిపిఐ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ గంగావతి, ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎఒ ఉమాదేవి, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ జనార్ధన్, సిడిపిఒ భారతి, మండల వ్యవసాయాధికారి చెన్న వీరస్వామి, ఉప ఉద్యాన అధికారి హరి, వైద్యాధికారులు మహేంద్రనాథ్, ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపిపి మల్లేశ్వరయ్య, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, పద్మాకర్ రెడ్డి, రాజారెడ్డి, కాటమయ్య, బయపురెడ్డి, శారద, శివమ్మ, రమాదేవి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

**రెగ్యులర్ విద్యుత్ ఎఇ నియామకానికి కృషి**

మండలంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే రెగ్యులర్ విద్యుత్ శాఖ ఎఇని నియమిస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. నార్పలలో విద్యుత్ సమస్యలు అధికాంగానే ఉన్నాయన్నారు. ఇందుకు రెగ్యులర్ ఎఇ లేకపోవమే అన్నారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా ఎఇని నియమిస్తామని తెలిపారు.

## పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

బొమ్మనహాల్‌లో పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని శ్రీధర్‌ఘట్ట గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులు, గొర్రెలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలు, బర్రెలు, ఆవులు, ఎద్దులకు టీకాలతోపాటు ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గం రూరల్ :** మండల పరిధిలోని తిమ్మసముద్రం, కామకపల్లి గ్రామాల్లో డాక్టర్లు శ్రీనివాస్‌గుప్తా, మంజునాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు 850 పశువులకు గాలికుంటు టీకాలు వేయడంతోపాటు 96 పశువులకు చికిత్స చేశారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందు తాపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గోపాల్ మిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

**బెలుగుప్ప :** మండలంలోని బెలుగుప్ప తండా, కాలువపల్లి గ్రామాల్లో పశువైద్య అధికారులు రమేష్, స్రవంతి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులకు నట్టల నివారణ మందులు తాపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాలిబాయి, మాజీ ఎంపిటిసి లక్ష్మీబాయి గంగ్యానాయక్, పశు వైద్య సిబ్బంది మారుతి, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సుధాకర్‌నాయక్, ఎర్రిస్వామి, అశోక్, భారతి, సుదర్శన్, రవితేజ, వంశీకృష్ణ, రవికుమార్, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల హక్కులను కాపాడాలి

### సర్వసభ్య సమావేశంలో జడ్పిటిసి

**ప్రజాశక్తి-యల్లనూరు**

సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

మండలవ్యాప్తంగా సర్పంచుల హక్కులను కాపాడాలని పలువురు సర్పంచులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా 15 శాఖలకుగాను కేవలం ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతే అధికారులు లేని సమావేశం ఏంటని మండల అధ్యక్షులు గంగాదేవి, జడ్పిటిసి భోగాతి విజయప్రతాప్‌రెడ్డి, తదితరులు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డిని ప్రశ్నించారు. అనంతరం సమావేశం ప్రారంభం కాగానే మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచుల తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తున్నారంటూ జడ్పిటిసి భోగాతి విజయ్‌ప్రతాప్‌రెడ్డి అధికారులను నిలదీశారు. గతంలో తమ ప్రభుత్వం వచ్చేనాటికి ఎక్కువ శాతం టిడిపి సర్పంచులే ఉన్నారని, అప్పట్లో వారందరికీ గౌరవం ఇచ్చామని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు కనిపించలేదన్నారు. ఏదిఏమైనా సర్పంచుల తీర్మానం లేకుండా పనులు చేయించేది లేదని తేగేసి చెప్పారు.

## ఐదేళ్లలో లేని అభివృద్ధిని ఆరునెలల్లో చేసి చూపించాం

### ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ప్రజాశక్తి-అనంతపురం రూరల్**

కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

గత వైసిపి ఐదేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరునెలల్లోనే చేసి చూపించామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని 28 డివిజన్ అశోక్ నగర్ మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 7గంటల నుంచే మున్సిపల్ అధికారులు, స్థానిక టిడిపి నాయకులతో కలసి ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంటింటికీ వెళ్తూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. చాలా మంది డ్రైనేజీ సమస్యలు, గత ప్రభుత్వంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా మాకు రాలేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఏ ఒక్క పని జరగలేదన్న ఆవేదన ప్రజల్లో ఉన్నారని తెలిపారు. కానీ ఈ ఆరు నెలల్లో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. పింఛన్లు, రేషన్ క్రమం తప్పకుండా అందుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణు మూర్తి, టిడిపి రాష్ట్ర నాయకుడు గంగారామ్, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలార్ భాష, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, పద్మశాలి ఫెడరేషన్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని మెటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వై.విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక రవాణా శాఖ వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో వాహనదారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే కారు నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడిపితే లైసెన్స్‌లను రద్దు చేయడంతోపాటు ఆరు నెలలపాటు జైలు శిక్షకు గురి కావాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వాహన చోదకులు పాల్గొన్నారు.

## ఆదుకోవాలని రైతుల వినతి

**ప్రజాశక్తి-గుత్తి**

అగ్ని ప్రమాదం కారణంగా పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన రైతులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ డి.ఓబిలేసును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన నాగూరు ఖాదర్ భాషా కంది, కొర్ర పంటలు సాగు చేశాడు. అలాగే మౌలాలి అనే రైతు కంది పంటను సాగు చేశాడు. ప్రమాదవశాత్తు వీరిద్దరి పంటలకు నిప్పంటుకుని దహనమయ్యాయి. చేతికి వచ్చిన పంట అగ్ని ప్రమాదానికి గురి కావడంతో నాగూర్ ఖాదర్ బాషా రూ.2 లక్షలు, మౌలాలి రూ.1.30 లక్షలు ఆర్థికంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎ.పులికొండ, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

సిఎం రిలీఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

**కళ్యాణదుర్గం రూరల్ :** బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ మృత్యువుతో పోరాడి ఓడిన వాల్మీకి లిఖిత తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.10లక్షలు చెక్కును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మంగళవారం స్థానిక ప్రజావేదికలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోళ్ల వెంకటేష్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**-చెక్కభజన కళాకారులకు రూ.20వేలు..**

మండలంలోని మల్లిపల్లి గ్రామంలో జరుగుతున్న చౌడేశ్వరి అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల చెక్క భజన బృందానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన సొంత నిధులు రూ.20వేలు అందజేశారు.

**వేమన విగ్రహం ఏర్పాటుకు వినతి**

పట్టణంలో యోగివేమన విగ్రహంతోపాటు కమ్యూనిటీ భవనం మంజూరుకు చర్యలు తీసుకోవాలని పలువురు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రెడ్డి సామాజిక వర్గం నాయకులు కంబాల తిమ్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గౌని మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలు తొలగిస్తాం

**కుందుర్పి :** మండల కేంద్రంలో రోడ్డుకు ఇరుపక్కల ఆక్రమణ నిర్మించుకున్న కట్టడాలను తొలగిస్తామని ఆర్అండ్‌బి కళ్యాణదుర్గం ఎగ్జిక్యూటివ్ డివిజనల్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. 'రహదారి ఆక్రమణపై ఫిర్యాదు అనే' శీర్షికతో మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం వెలువడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించడంతోపాటు డ్రైనేజీ పనులను పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతీశ్వర రామ్మూర్తి, ఆయకట్టు ఛైర్మన్ రామ్మూర్తినాయుడు, నాయకులు పెద్ద నరసింహప్ప, బూదిడి మల్లికార్జున, కురుబ సంఘం మండల అధ్యక్షులు రమేష్, టౌన్ కన్వీనర్ రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు యాడికి మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**యాడికి :** ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తుగ్గొట్టపల్లి, నగరూరు, రామరాజుపల్లి, గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు, రైతులు సమస్యలు ఉంటే గ్రామసభలో విన్నవించుకోవాలని కోరారు.

## రైతులకు యూరియా పంపిణీ

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని పోలేపల్లి రైతు సేవాకేంద్రంలో రబీ పంటలు సాగు చేసిన రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయితేజ, మాజీ సర్పంచు రామచంద్రప్ప, టిడిపి నాయకులు వన్నూరుస్వామి, బూత్ కన్వీనర్ కోళ్ల తిప్పేస్వామి, కమ్మ జనార్దన్, సిద్దేశ్, నింగప్ప, సత్యానంద, మంతెష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 'మోడల్' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

**అనంతపురం :** మోడల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులతోపాటు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపిఎంఎస్ఎస్‌టియు నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం డిఇఒ ఎం.ప్రసాద్‌బాబును కలిసి విన్నవించారు. ఈ కార్యక్రంలో ఎపిఎం ఎస్ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు జి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఆర్థిక కార్యదర్శి సత్యనారాయణ, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, ఎపిఎంఎస్ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ సతీష్, వెంకటపతి, హనుమంతురాయుడు, ప్రసాద్, అఫ్రిన్ బాను, భాగ్యలక్ష్మి, రజనీ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## 23న రక్తదాన శిబిరం

**కళ్యాణదుర్గం రూరల్ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 23న పట్టణంలోని ప్రజావేదిక వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం కార్యకర్తలు నాయకులు, కూటమి నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, టిడిపి మండల అధ్యక్షులు గోల్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు

**బెలుగుప్ప :** మండలానికి 34 బిసి కార్పొరేషన్ యూనిట్ల రుణాలు మంజూరైనట్లు ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో బిసి-ఎకు 15, బిసి-బికి 10, బిసి-డికి 5, బీసీ-ఇకి 4 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. వీటికోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సిపిఐ సీనియర్ నాయకులు వెంకటేశులు మృతి

**ఉరవకొండ :** వజ్రకరూరు మండల పరిధిలోని చిన్నహోతూరు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ వెంకటేశులు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన తన తండ్రి ఎల్లప్ప ఆశయాలను పునికి పుచ్చుకుని సిపిఐలో పని చేశారు. అలాగే సిపిఐ అనుబంధ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజానాట్య మండలి, తదితర ప్రజాసంఘాల్లో కూడా పని చేశారు. కాగా సిపిఐ నియోజకవర్గ సీనియర్ నాయకులు శ్రీధర్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎంబి చెన్నారాయుడు, గన్నేమల్లేసి, పురిడి తిప్పయ్య, నాగన్న, తదితరులు వెంకటేశులు మృతదేహంపై సిపిఐ జెండా కప్పి నివాళులర్పించారు.

## గుండెపోటుతో ఆర్ఎంపి మృతి

**పామిడి :** అనంతపురంలోని పాతూరులో నివాసం ఉంటున్న ఆర్ఎంపి వైద్యుడు గోవిందరాజులు(62) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. గోవిందరాజులు 25ఏళ్లుగా పామిడిలో ఆర్ఎంపి వైద్యుడిగా సేవలు అందిస్తున్నారు. అంతేగాకుండా ఎపిఎంపిఎ సంఘం సీనియర్ సభ్యులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. కాగా విషయం తెలుసుకున్న ఎపిఎంపిఎ సంఘం మండల కన్వీనర్ నాగమల్లారెడ్డి, డాక్టర్ మస్తానయ్య, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్, డాక్టర్ మజీద్, డాక్టర్ అస్లాం ఖాన్, శ్రీనివాస రావు, ఖలందర్, రాము, లక్ష్మీనాథ్, తదితరులు నివాళులర్పించారు.

## పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

**అనంతపురం :** శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్, ప్రపంచ తెలుగు సాహిత్య, సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు, ప్రతాప్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### విద్యుదాఘాతంతో యువకుడు మృతి

వి.కిరణ్ (పాతచిత్రం)

**యల్లనూరు :** విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండల పరిధిలోని దుగ్గుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేకు.. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు వి.కిరణ్ (21) స్వగృహంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఇనుప నిచ్చెనకు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో నిచ్చెన నుంచి కింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. వివాహ వయసుకు వచ్చిన కుమారుడు మృతిచెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.

### కారును ఢీకొని లారీ బోల్తా..

**గుత్తి :** మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై మంగళవారం కారును లారీ వెనుక నుంచి ఢీకొని బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీని కారు ఓవర్ టేక్ చేస్తోంది. అయితే ముందు వెళ్తున్న కారును లారీ డ్రైవర్ గమనించకుండా వెళ్లి ఢీకొన్నాడు. కారుకు లారీ తగిలిన అనంతరం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**కళ్యాణదుర్గం రూరల్ :** కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ సిఐ వంశీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాష్ట్రంలో సేకరించిన బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.